గచ్చిబౌలి డివిజన్‌లో ట్రాఫిక్ అధికారుల పర్యటన



గచ్చిబౌలి: గచ్చిబౌలి డివిజన్‌లో ట్రాఫిక్ అధికారులు మంగళవారం పర్యటించారు. హెచ్‌జీసీఎల్ డీఈఈ మీనాక్షి, జీహెచ్‌ఎంసీ ఈఈ శిరీష, గచ్చిబౌలి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి సురేష్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లతో కలిసి పర్యటించారు. గచ్చిబౌలి, నానక్‌రాంగూడ రోటరీ, నానక్‌రాంగూడ ఓఆర్ఆర్ అండర్‌బ్రిడ్జి, గౌలిదొడ్డి ప్రాంతాలలో పర్యటించారు. వరదనీరు నిల్వ ఉండే ప్రాంతాలలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. గౌలిదొడ్డిలోని రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టాలని నిర్ణయించారు. ఆయా ప్రాంతాలలో ఫుట్‌పాత్‌లను పరిశీలించి వాటికి మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్ : లెజెండ్, మయూరీనగర్ ఫీడర్, రెడ్డి కాలనీ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ రవిచంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు లెజెండ్ అపార్ట్‌మెంట్స్, మయూరీనగర్, ఎస్‌బిఐ బ్యాంకు రోడ్డు, ఓల్డేజ్ హోమ్, కోరుకొండ స్కూల్, రెడ్డి కాలనీ,సాయినగర్, సాయిజ్యోతి నగర్, బీకేఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

సర్వేకు సహకరించాలి

ఆల్విన్‌కాలనీ: జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టే ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ జీఐఎస్ సర్వే (జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సర్వే)కు ప్రతి ఒక్కరూ సహకరించాలని తులసినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కూకట్‌పల్లి తులసినగర్‌లో జియో గ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సర్వే సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సర్వే ద్వారా గూగుల్ మ్యాప్‌తో పాటు సులభంగా ఇంటిని త్వరగా గుర్తించటానికి ఉంటుందని, ఈ సర్వే ద్వారా అనేక ఉపయోగాలు ఉంటాయని పేర్కొన్నారు.

హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



విద్యార్థుల ర్యాలీ



మొక్క నాటుతున్న దృశ్యం

4 కిలోమీటర్లు.. 800 మంది విద్యార్థులు

మాదాపూర్: దేశభక్తిని పెంపొందించే విధంగా విద్యార్థులు మాదాపూర్‌లోని సీసీఆర్టీలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సాంస్కృతిక వనరులు, శిక్షణ కేంద్రం రీజినల్ సెంటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో హైటెక్స్ కమాన్ నుంచి ఖానామెట్ జంక్షన్ వరకు 4 కిలోమీటర్ల మేర 800 మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. సీసీఆర్టీలో విద్యార్థులు పాటలతో సందర్శకులను అలరించారు.

రాయదుర్గం: గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో మంగళవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జెండాలు చేతబూని భారీ ర్యాలీ, మొక్కలు నాటారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ బీజేరావు మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమాలు

ఆన్‌లైన్ భద్రత, వ్యక్తిగత డేటాను రక్షించడానికి, సైబర్ బెదిరింపులను నివారించడానికి కంప్యూటర్ సెంటర్, క్యాంపస్ నెట్‌వర్క్ ఫెసిలిటీ డైరెక్టర్ డాక్టర్ సంజయ్‌శర్మ ఆన్‌లైన్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ రకాల బీమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ ఫ్యాకల్టీ, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.





ర్యాలీలో పాల్గొన్న ఫ్యాకల్టీ, అధికారులు, విద్యార్థులు

గాయాలతో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మియాపూర్ : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం...మియాపూర్ న్యూ కాలనీకి చెందిన ఎం. శ్రీను అలియాస్ జాడ(28) కూలీ.ఈ నెల 9వ తేదీన శనివారం మధ్యాహ్నం మియాపూర్‌లోని లక్ష్మీనగర్ చెరువు సమీపంలో చెట్ల పొదల్లో శ్రీను పడి ఉన్నాడని స్థానికులు శ్రీను సోదరుడు శంకర్‌కు ఫోన్ చేశారు. శంకర్ అక్కడికి వెళ్లి చూడగా శ్రీను కడుపు, మెడ భాగంలో గాయాల నుంచి రక్తస్రావం జరగడాన్ని చూసి ఆసుపత్రికి తీసుకువెళ్లి తిరిగి ఇంటికి తీసుకువెళ్లాడు. రక్తస్రావం ఆగకపోవడంతో మెరుగైన చికిత్స నిమిత్తం బాచుపల్లిలోని మమత ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం శ్రీను మృతి చెందాడని తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు శ్రీను మద్యం సేవించే వాడని, 9వ తేదీన మధ్యాహ్నం కొందరు వ్యక్తులు అతనితో గొడవపడ్డారని స్థానికులు సోదరుడు శంకర్‌కు చెప్పారు. మృతుడు సోదరుడు శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. శ్రీనుకు భార్య సుజ్జీ, ఇద్దరు పిల్లలున్నారు. గత రెండు సంవత్సరాలుగా కుటుంబానికి దూరంగా ఉంటున్నట్లు సమాచారం.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో ... టమాట 50, పచ్చిమిర్చి 60 , బెండ 50, కాకర 40, దొండ 35, దోస 30, ఆలు 30, చామ 40, కీర 35, బీర 40, వంకాయ 40, గోకర 50, బీన్స్ 80, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 25, క్యారెట్ 50, చిక్కుడు 70, ఉల్లి 30(కేజీ), ములక్కాయలు (2) 10 , క్యాలీ ఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 100, వెల్లుల్లి 150.

వర్షానికి కూలిన గోడను నిర్మిస్తాం

కార్పొరేటర్ శ్రీనివాసరావు



కూలిపోయిన గోడను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ పార్కు, జలవాయువిహార్ కాలనీ సరిహద్దు గోడ భారీ వర్షాలకు కూలిపోయిందన్న సమాచారం మేరకు జీహెచ్‌యంసి ఇంజనీరింగ్ అధికారులు, రెండు కాలనీల కమిటీ సభ్యులతో కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో గోడ నిర్మాణ పనులు మొదలు పెట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌యంసీ ఇంజనీరింగ్ ఏఈ రాజీవ్, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

నేషనల్ లైబ్రరీ డే



గచ్చిబౌలి: గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని గ్రంథాలయంలో నేషనల్ లైబ్రరీ డేను నిర్వహించారు. వింగ్స్ ఆఫ్ వండర్ స్కూల్ విద్యార్థులు పుస్తకాల వివరాలను తెలుసుకున్నారు. కథల పుస్తకాలు, చిన్నకథలు, నవలలు చదివారు. లైబ్రరీ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లైబ్రరీ ఇన్‌చార్జీ అనిల్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం బాధ్యులు విజయ్‌కుమార్, రవీందర్, సిబ్బంది, పాఠశాల ప్రతినిధి రాంమోహన్, జగదీష్, మణిదీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం: ఎమ్మెల్యే గాంధీ



రాయదుర్గంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం/శేరిలింగంపల్లి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లో పలు కాలనీలు, బస్తీలలో రూ.5.42 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్లు, వరదనీటి కాలువల నిర్మాణానికి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్‌బాబు సంపూర్ణ సహకారంతో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేశామన్నారు. కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీలు,బస్తీలలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, ఆయా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానికులు, నాయకులు పాల్గొన్నారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు

మియాపూర్ : మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రధాన కూడళ్లలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. చందానగర్ గంగారంలోని ఖజానా జువెలర్స్‌లో గుర్తుతెలియని దుండగుల చోరీ యత్నం నేపథ్యంలో సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఆదేశాల మేరకు మాదాపూర్ డీసీపీ వినీత్ పర్యవేక్షణలో మియాపూర్ సీఐ శివ ప్రసాద్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. వాహనాలను నిలిపి క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ మాణిక్యం, పోలీస్ సిబ్బంది చెన్నయ్య, విజయ్‌కుమార్ తదితరులున్నారు.

15న 2 కే రన్

పటాన్‌చెరు టౌన్: స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో ఎండీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 15 వ తేదీన 2 కే రన్ ఉంటుందని నిర్వాహకులు పృథ్వీరాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మనం పీల్చే గాలిలో ఎంత నాణ్యత ఉందో ప్రతి ఒక్కరికి తెలియాలనే ఉద్దేశంతో 15 వ తేదీ ఉదయం 6 గంటలకు 2కే రన్‌ను పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రి నుండి ఎం.జీ రోడ్డు, మార్కెట్ రోడ్డు మీదుగా తిరిగి ప్రభుత్వ ఆసుపత్రి వరకు జరుగుతుందన్నారు.

ఆర్థిక సంక్షోభంతోనే రైతుల ఆత్మహత్యలు

చందానగర్ : రైతులు ఆర్థిక సంక్షోభానికి గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని సీఆర్ ఫౌండేషన్ సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర వ్యవసాయ సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిని కలిసి నివేదికను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సమస్యలను గురించి తెలియజేస్తూ, నేలల భూసారం వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వ సమగ్ర పంటల సాగు విధానాన్ని, వ్యవసాయ ప్రణాళికలను రూపొందించాలన్నారు. విత్తన రంగంలో స్వయం సమృద్ధిని సాధించేందుకు వెంటనే విత్తన చట్టాన్ని తీసుకురావాలన్నారు .ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు బీమా మొత్తంను నష్టం వాటిల్లిన మూడు వారాల్లోపు చెల్లించాలన్నారు.

కిటకిటలాడిన గణేష్‌గడ్డ



పటాన్‌చెరు టౌన్: అంగారక చతుర్థిని పురస్కరించుకొని రుద్రారం గణేష్ గడ్డ దేవస్థానం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. భారీ సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి రావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి. ఉదయం గణనాథుడికి తేనె అభిషేకం చేసినట్లు ఆలయ అర్చకులు సంతోష్ జోషి, జగదీశ్వర్‌స్వామి, చంద్రశేఖర్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మాదాపూర్: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మంగళవారం మాదాపూర్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. మాదాపూర్ అయ్యప్పసొసైటీ 100 అడుగుల రోడ్డులో భిక్షాటన చేస్తున్న వ్యక్తి కింద పడిపోయాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు 108కి డయల్ చేయగా వారు పరిశీలించి అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. వయస్సు (70), నేవీ బ్లూ షర్టు, బ్లూ ప్యాంటు ధరించి ఉన్నాడు.సమాచారం తెలిస్తే ఫోన్ 8712663119లో తెలపాలని కోరారు.